క్లుప్తంగా

అనారోగ్యంతో బాలిక మృతి

రాయపర్తి : అనారోగ్యంతో బాలిక మృతి చెందిన ఘటన తిర్మలాయపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిక్కుడు శ్యాం–రవళి దంపతుల కూతురు అక్షయ(13) కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అక్షయ శుక్రవారం మృతి చెందింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాంగ్రెస్ మండల నాయకుడు, ఇల్లంద మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ ముద్రబోయిన వెంకటేశ్వర్లు బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పాశం నరోత్తంరెడ్డి, శంకరయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు



రాయపర్తి : బాటసారుల దాహార్తిని తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కొండాపురం కారోబార్ గాదె శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి చలివేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కారోబార్ శ్రీనివాస్ మాట్లాడారు. అధికారుల ఆదేశాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాటసారులు, ప్రయాణికులు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగి యాకాంబ్రం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణ తరగతులు

సంగెం : మార్గం స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు ప్రస్తుతం 9వ తరగతి పూర్తి చేసుకుని రానున్న విద్యాసంవత్సరంలో 10వ తరగతికి వెళ్లనున్న విద్యార్థులకు మండల కేంద్రంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ సురేశ్, సింగారపు బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 10 తరగతిలో 10 జీపీఏ సాధించే దిశగా శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 21న ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 7801078784, 9951231376ల్లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

నర్సంపేట రూరల్ : ఆటోను కారు ఢీకొట్టడంతో వృద్ధుడికి గాయాలైన ఘటన నర్సంపేటలోని అయ్యప్ప ఆలయ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని గురిజాలకు చెందిన మచ్చిక సమ్మయ్య గ్రామం నుంచి ఆటోలో నర్సంపేటకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సమ్మయ్య ఆటో నుంచి కిందపడిపోయి గాయాల పాలయ్యాడు. స్థానికులు ఆయన్ను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు.

నివాళి



నర్సంపేట : పట్టణానికి చెందిన బండారి శైలజ, కనకం రమక్క అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా వారి మృతదేహాలకు టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవి, పట్టణ ఉపాధ్యక్షుడు కొలుపుల వెంకటేశ్వర్లు, మాజీ వార్డు సభ్యుడు మెరుగు సాంబయ్య, గాజుల రమేశ్, కిసాన్ సెల్ పట్టణ అధ్యక్షుడు వెంకన్న, నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

దామెర : మండలంలోని ముస్త్యాలపల్లిలోని బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై కొంక అశోక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన రంగు మనీష్ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా అతని వద్ద రూ. 678, నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామానికి చెందిన మామిండ్ల మణెమ్మ నుంచి రూ. 3,150 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

- ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు

ఖానాపురం : గత ప్రభుత్వంలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలంలోని కొడ్తిమాటు తండా, మర్నాగిబోడు తండా, బోటిమీదితండా, బుధరావుపేట గ్రామాల్లోని రోడ్లపై శుక్రవారం పువ్వులు చల్లుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్ల పనులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఈ క్రమంలో మంజూరైన కోట్ల రూపాయల నిధులు వృథా అయ్యే ప్రమాదం ఉందన్నారు. సత్వరమే పనులను చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, మాజీ సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, రమేశ్, పద్మావతి వెంకన్న పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలి

నల్లబెల్లి : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఆ పార్టీ రుద్రగూడెం క్లస్టర్ ఇన్‌చార్జ్ గందె శ్రీనివాస్ గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముచ్చింపులతండా, రంగాపురం, దస్తగిరిపల్లి, అర్షనపల్లి, నాగరాజుపల్లి, మామిండ్ల వీరయ్యపల్లి, పంతులుపల్లి, చిన్నతండా గ్రామాల్లో రోడ్లపై పూలు చల్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడారు. మండలంలోని 14 రోడ్లకు 19 కిలోమీటర్ల మేర గత ప్రభుత్వం రూ.20.09 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకుని రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మామిండ్ల మోహన్‌రెడ్డి, జాటోత్ తిరుపతి, మాజీ సర్పంచ్‌లు గోనె శ్రీదేవి, ఊరటి అమరేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : నిరసన తెలుపుతున్న నాయకులు



నల్లబెల్లిలో..

పనులు ప్రారంభించండి

దుగ్గొండి : మండలంలోని 10 గ్రామీణ లింక్ రోడ్లను తారు రోడ్లుగా మార్చడానికి పనులు ప్రారంభించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని దేశవాయిపల్లిలోని శంబయ్యపల్లి, గుడిమహేశ్వరం క్రాస్ రోడ్డులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలోని లింక్ రోడ్లను తారు రోడ్లుగా మార్చడానికి సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నుంచి రూ.14.60 కోట్లు మంజూరై టెండర్లు పూర్తి చేసి అగ్రిమెంట్ అయినట్టు తెలిపారు. మరో రెండు నెలల్లో వర్షాలు మొదలయ్యే అవకాశం ఉన్న క్రమంలో వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు పొన్నం మొగిలి, కాట్ల భద్రయ్య, పల్లాటి జైపాల్‌రెడ్డి, శంకేషి కమలాకర్, గుండెకారి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : మాట్లాడుతున్న శ్రీనివాస్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

గీసుకొండ : మండలంలోని కొమ్మాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పరకాల ఎమ్మెల్యే, పార్టీ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి బస్కె సాంబయ్య, బస్కె మణి, కందుకూరి రమేశ్, మామునూరి సుధాకర్, శ్రీనివాస్, తగరపు రాజు, రఘు, మహేందర్, బస్కె సుధాకర్, తదితర 30 కుటుంబాల నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జక్కుల సరిత, నాయకులు సాయిలి ప్రభాకర్, నాగారపు స్వామి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఎంపీగా సీతారాంనాయక్ గెలుపే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

నర్సంపేట : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా అజ్మీరా సీతారాంనాయక్ గెలుపే ధ్యేయంగా మహబూబాబాద్‌లో నేడు (శనివారం) విజయ సంకల్ప సభ నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు తెలిపారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశం, రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి చెందినట్టు తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారని చెప్పారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన సీతారాంనాయక్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. విజయ సంకల్ప సభకు బూత్ కమిటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అన్ని బూత్‌ల నుంచి సీతారాంనాయక్‌కు ఓట్లు పోలయ్యేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ పట్టణ ఇన్‌చార్జ్ గుడిపూడి రాధాకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, ఠాకూర్ రవీందర్‌సింగ్, రాంచందర్, ఉపాధ్యక్షులు మల్యాల సాంబమూర్తి, ఠాకూర్ శివాంజన్‌సింగ్, మల్లాజీ నరేందర్, మధ్యల శ్రీనివాస్, కందికొండ శ్రీనివాస్, కందగట్ల నాగరాజు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కందికొండ ప్రభాకర్, కార్యదర్శి ఠాకూర్ విజయ్‌సింగ్, చేను నరేశ్, యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి కుసుమ భవానీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం



కాలిపోయిన పంటలను పరిశీలిస్తున్న రవీందర్‌రావు

ఖానాపురం : షార్ట్ సర్క్యూట్‌తో పంటలు కాలిపోయి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. మండలంలోని కొత్తూరులో కొమురయ్య, భద్రు, కుమారస్వామిలకు చెందిన నాలుగెకరాల మొక్కజొన్న పంట దగ్ధమైన క్రమంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. బాధిత రైతులను ఓదార్చారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసువెళ్లి పరిహారం ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. వెంటనే విద్యుత్ లైన్లను సరిచేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీర రాజు నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.80 వేలు ఇవ్వాలి

దగ్ధమైన కొమురయ్య, భద్రు, కుమారస్వామిలకు చెందిన పంటలను ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సందర్శించి పరిశీలించారు. మొక్కజొన్న పంట దగ్ధం కావడం బాధాకరమన్నారు. బాధిత రైతులకు ఎకరాకు రూ.80 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు సదర్‌లాల్, బాలునాయక్, ఎల్లయ్య తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం



గీసుకొండ : మండలంలోని ధర్మారంలోని జనప్రియ ఆస్పత్రిలో వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ దర్శన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ వి.రాజేశ్, జోన్ చైర్మన్ కరుణాకర్, కాశిబుగ్గ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పి.సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి.రమేశ్, కార్యదర్శి భద్రయ్య, కోశాధికారి మురళీధర్, బీఆర్ఎస్ నాయకుడు సుంకరి శివ, తదితరులు పాల్గొన్నారు.

‘భూ ఆక్రమణపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం’

వర్ధన్నపేట : పట్టణంలోని సర్వే నంబర్ 626లోని 670 గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని టీడీపీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడ మరియా సురేఖ తెలిపారు. టీడీపీకి చెందిన భూమి అన్యాక్రాంతమౌతోందంటూ ఆ పార్టీ నాయకులు పట్టణ కేంద్రంలో శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మరియా సురేఖ సదరు భూమిని పరిశీలించి మాట్లాడారు. సదరు 670 గజాల స్థలాన్ని 1994లో టీడీపీ పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలిపారు. ఆ భూమిని కొందరు అమ్ముకున్నారని ఆరోపించారు. ఆ భూమిలో నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న క్రమంలో సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. 1994లో నాటి సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆ భూమిని పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించారని వివరించారు.



మాట్లాడుతున్న మరియా సురేఖ

మైసమ్మ ఆలయాన్ని నిర్మించాలి

వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మైసమ్మ ఆలయాన్ని ఎండాకాలంలోనే పూర్తిగా ఎత్తులో నిర్మించుకోవాలని గ్రామానికి చెందిన భూమా సుధాకర్, నారెల్లి సుధాకర్, బొల్లు వెంకటయ్య, భూమా శ్రీను, బొల్లు శ్రీను, బోనాల వెంకన్న, ఎద్దు వెంకటేశ్వర్లు, వెంకన్న, భూమా రమేశ్ కోరారు. మైసమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చెరువు కట్ట మరమ్మతు పనులు చేపట్టిన సందర్భంలో ఆలయం రోడ్డుకు కిందకి కావడంతో స్లాబ్ వేసి ఎత్తులో నిర్మించాలని భావించినట్లు తెలిపారు. అప్పటి చెరువు కట్ట కాంట్రాక్టర్ ఎత్తులో నిర్మించడానికి సహకరిస్తానని చెప్పినట్టు గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా అరూరి రమేశ్ ఉన్నప్పుడు తప్పనిసరిగా మైసమ్మ ఆలయాన్ని నిర్మిస్తామని ప్రజలకు హామి ఇచ్చి ఓడిపోగానే మాటతప్పాడని చెప్పారు. నాయకుల మాటలు నమ్మి మోసపోయామన్నారు. ప్రస్తుతం గుడి కట్ట దిగువన ఉన్న నేపథ్యంలో చెరువులోకి నీరు చేరితే ఆలయం మునిగే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలం మొదలవక ముందే ఆలయాన్ని ఎత్తులో నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్, తదితరులు

తండాలో తాగునీటికి తండ్లాట

సంగెం : మండలంలోని బాలునాయక్ తండాలో తాగునీటి కోసం తండ్లాట తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. 6వ వార్డులో 20 కుటుంబాలు రెండేళ్లుగా నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తండా కంటే ఎత్తులో మిషన్ భగీరథ పైపు లైన్ నల్లాలు ఉన్నప్పటికీ ఒకటి, రెండు బిందెలకు నీరు రావడం లేదని తండావాసులు తెలిపారు. తండా అంతటా ఒకే రీతిన నల్లాలు బిగించాల్సి ఉండగా తక్కువ ఎత్తులో ఉన్న ఇళ్ల వద్ద నల్లాలకు నిబంధనలకు విరుద్ధంగా భారీ పైపులు వేయడంతో అక్కడి జనానికి అవసరానికి మించి నల్లా నీరు వస్తుండగా 6వ వార్డులోని 20 కుటుంబాలు నీరు రాక ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నీటి కోసం పక్క వాడలోకి పరుగులు తీస్తున్నామని, వ్యవసాయ పనులు మానుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు. వేసవి నేపథ్యంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్నాం

తండాలోని 6వ వార్డు కాలనీకి తాగేనీటి సమస్య ఉన్నది వాస్తవమే. ఎత్తులో ఉండడం వల్ల నల్లా నీరు సరిగా అందడం లేదు. అందుకే ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్నాం. సరిపోవడం లేదని స్థానికులు అంటున్నారు. శాశ్వత పరిష్కారం కోసం ఓపెన్ వెల్ నుంచి లైన్ ఏర్పాటు చేస్తాం. పైపులైన్ వేసే మార్గంలో పంటలు ఉన్నాయి. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యాంకర్ ద్వారా నీరందిస్తాం.

–రెహానా, జీపీ కార్యదర్శి, బాలునాయక్ తండా



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

సదస్సులను జయప్రదం చేయండి



నినాదాలు చేస్తున్న ప్రణయ్‌దీప్, నాయకులు

నర్సంపేట : ఈనెల 15న తలపెట్టిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మహబూబాబాద్ పార్లమెంట్ స్థాయి సదస్సులను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ కోరారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ప్రతినిధి బృందం వాసవి కల్యాణ మండపంలో నిర్వహించనున్న సదస్సు ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్ మాట్లాడారు. సదస్సులో మహాజన నేత, ఎమ్మార్పీఎస్ దండోరా వ్యవస్థాపకుడు మంద కృష్ణ హాజరవుతున్నారని తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని నర్సంపేట, ములుగు, మహబూబాబాద్, ఇల్లందు, భద్రాచలం, పినపాక, డోర్నకల్ నియోజకవర్గాల్లోని నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంల నాయకులు తడుగుల విజయ్, కట్ల రాజశేఖర్, చింతం సిద్దు, దామెర సుధాకర్, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతా రామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన కరిమిళ్ల సోమక్క సంపత్‌రావు దంపతుల పెద్ద కుమారుడు ప్రసాద్‌రావు–ధనలక్ష్మి, చిన్న కుమారుడు రాజురావు–మానస దంపతులు ఆలయ కమిటీ బాధ్యులకు శుక్రవారం రూ.లక్ష 116ల విరాళం అందజేశారు.

ముగిసిన ఉర్సు

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్ షామీర్‌పూర్‌లో హజ్రత్ హాజీ కలందర్ దర్గా అధ్యక్షుడు మహ్మద్ మాషూక్ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు జరిగాయి. మహ్మద్ మాషూక్‌తో కలిసి దర్గా పీఠాధిపతి నవీద్‌బాబా కలందర్ దర్గాను శుక్రవారం సాయంత్రం దర్శించారు. అనంతరం ఊరేగింపుతో దర్గాకు చేరిన జెండాకు నవీద్‌బాబా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు యాకూబ్, సులేమాన్, అక్బర్, ఖాజాపాషా, గౌస్, తాజ్‌పాషా, సలీమ్ పాషా పాల్గొన్నారు

‘బీఆర్ఎస్ నిరసనలు సిగ్గుచేటు’



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

నెక్కొండ : గత ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులు చేపట్టకుండా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలపడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పెద్దకోర్పోలు, చిన్నకోర్పోలు వరకు బీటీసీ రోడ్డు నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరు కాగా టెండర్లు పిలిచినా ఎవరూ పాల్గొనలేదని చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికీ టెండర్ ప్రక్రియ మొదలెట్టే పరిస్థితి లేదన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాని పనులను ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారంటూ నిరసన తెలపడం అనైతికం, మోసపూరితమని తెలిపారు. నిధులు లేని జీఓలతో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించారని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మండలంలో అభివృద్ధి పనులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సముద్రాల కనకయ్య, నాయకులు మాదాసు రామ్మూర్తి, ఆకుల ఉప్పలయ్య, కోల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడుపొద్దు

చెన్నారావుపేట : మద్యం మత్తులో వాహనాలు నడుపొద్దని ఎస్సై గూడ అరుణ్‌కుమార్ కోరారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వాహనాలు నడిపే వ్యక్తులు లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనం ఇవ్వొద్దని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

‘బీఆర్ఎస్‌లోనే కొనసాగుతాం’

రాయపర్తి : బీఆర్ఎస్‌లో కొనసాగుతామని, పార్టీ మారే ప్రసక్తే లేదని జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తాము పార్టీ మారనున్నట్టు కొందరు దురుద్దేశంతో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హయాంలోనే మండలంలో అభివృద్ధి జరిగిందని చెప్పారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యకర్తలు అపోహలకు గురి కావద్దని చెప్పారు. పార్టీ మారే ఆలోచనలు చేయొద్దని కోరారు.



మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి, నర్సింహనాయక్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : నర్సంపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల రైతులు, వ్యాపారస్తులు, ప్రజలు, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలోని సబ్‌స్టేషన్ పరిధిలో చెట్టుకొమ్మల కత్తిరింపు, లైన్ మరమ్మతుల నేపథ్యంలో నేడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఏడీఈ కన్నరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఇల్లంద, నల్లబెల్లి, ఆర్డీతండా, రాంధాన్ తండా గ్రామాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్టు ఆయన వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లి, ఏనుగల్ సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ ఏడీ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. చౌటపల్లి, ఏనుగల్ గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య సమస్యతో ఇబ్బంది

రాయపర్తి : పారిశుద్ధ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టు మండలంలోని కాట్రపల్లికి చెందిన ముద్రబోయిన శ్రీనివాస్, ముప్పిడి కుమార్ వాపోయారు. ఆ గ్రామంలోని సైడ్‌డ్రైనేజీ వద్ద వారు మీడియాతో మాట్లాడారు. మూడు నెలలుగా కాల్వలు పూడుకుపోయాయని తెలిపారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ డబ్బాలు, తదితరాలు చేరి కాల్వలు నిండిపోయాయని చెప్పారు. ప్రజాప్రతినిధుల పాలన ముగిసిన క్రమంలో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టినా సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

